

అనుదినం.. జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
08 పేజీలు | మంగళవారం 31 అక్టోబర్ 2023 | www.navatelangana.com

రూ.30 ఖర్చవుతుంటే..
రూ.10.30 పైసలు చెల్లిసారా..?

- అల్పాహారం స్లాబు రూ.30కి పెంచాలి
- మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో వినతి

4లో..



రూ.25 లక్షల విలువ గల గంజాయి పట్టివేత

- 235 గంజాయి మొక్కలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ జిల్లా అధికారి రవీంద్రరాజు

8లో..



ప్రజాతీర్పు ఎదుర్కోలేకే భౌతిక దాడులు







- హత్యా రాజకీయాలు సిగ్గుచేటు
- 24 గంటలు కరెంట్ ఇస్తుంటే.. 5 గంటలు కరెంట్ చేసేందుకు రావాల్నా?
- కర్నాటక ప్రజలను మోసం చేసినట్టే ఇక్కడా మోసం చేసేందుకు కాంగ్రెస్ కుటీల యత్నాలు
- జుక్కల్, బాన్సువాడల్లో ప్రజాఆశీర్వాద సభల్లో కేసీఆర్

వార్త మెయిన్ పేజీలో...

పొరపాట్లకు లేకుండా పోలింగ్

- సక్రమంగా, సజావుగా ఎన్నికలు నిర్వహించాలి
- భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డి

రాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పొరపాట్లకు తావులేకుండా సక్రమంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్ సూచించారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ సన్నద్ధత పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి సోమవారం న్యూఢిల్లీ నుంచి భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్ జిల్లా ఎన్నికల అధికారులతో, ఎస్పీలు, పోలీస్ కమిషనర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పోలింగ్ సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ నవంబర్ 3న వెలువడనుండగా, నవంబర్ 10వ తేదీ నామినేషన్లు దాఖలు చేసేందుకు చివరి గడువు అని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని నామినేషన్ల స్వీకరణకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, నామినేషన్ల స్వీకరణ సమయంలో సమయపాలన ఖచ్చితంగా పాటించాలని, కార్యాలయంలో ఒకే గడియారం ఉండాలని అన్నారు. అభ్యర్థులు సమర్పించే నామినేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వెంటదివెంట ఆన్ లైన్ యాప్ లో నామినేషన్ల వివరాలను నమోదు చేయాలని సూచించారు.

టీజేఎస్ అభ్యర్థుల దారెటు..?

- పొత్తులో భాగంగా టికెట్‌లు కేటాయించని కాంగ్రెస్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా టీజేఎస్‌కు నాలుగు సీట్లను కేటాయించాలని టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ కోరిన విషయం విధితమే. కానీ టీజేఎస్ అభ్యర్థులకు టికెట్‌లు కేటాయిం చకుండా కాంగ్రెస్ పార్టీ నమ్మించి మోసం చేసిందని టీజెఎస్ అభ్యర్థులు మండిపడుతున్నారు. ఈ తరుణంలో టీజేఎస్ పార్టీని కాదని స్వతంత్ర బరిలో దిగుతారా..? లేకుంటే ఇతర పార్టీలైన బీజేపీ నుంచి టికెట్ తెచ్చుకుంటారా అని చర్చలు కొనసాగుతున్నట్టు సమాచారం. లేదంటే పోటీ నుంచి తప్పు కుని బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకుంటారా అని పలువురు గుసగుసలు ఆడుతు న్నారు.


కోదండరామ్‌తో మాట్లాడుతున్న రమేశ్

ఎల్లారెడ్డి నియోజకవర్గ అభ్యర్థి నిజ్జన రమేష్ ముదిరాజ్ సైతం పక్క పార్టీల వైపు చూస్తున్నట్టు సమాచారం. బీసీ కార్డును బీజేపీ ఉపయోగిస్తే ఎల్లారెడ్డిలో బీసీ నేత అయినటువంటి తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడికి టికెట్ వరించే అవకాశం కనిపిస్తుంది. పూర్వం గత ఎన్నికల్లో అంబర్‌పేట్ నియోజకవర్గం హైదరాబాద్ నుండి మహాకూటమి అభ్యర్థిగా ఎమ్మెల్యేగా 2018 ఎన్నికలలో బరిలో ఉన్నారు. కాగా నియోజకవర్గ మొత్తంలో రమేష్ సామాజిక వర్గం ముదిరాజ్ ఓటు బ్యాంకు 65 వేల వరకు ఉండటం రమేష్‌కు కలిసి వచ్చే అవకాశం ఉన్నట్టు కార్యకర్తలు పేర్కొంటున్నారు.

అభివృద్ధి కావాలా.. అరాచకం కావాలా..?

- ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

అభివృద్ధి కావాలా?, అరాచకం కావాలా? ప్రజలు ఆలోచించాలని ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్ ఎస్ అభ్యర్థి, ఆ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. మండలంలోని పత్తేపూర్, కోమన్ పల్లి గ్రామాల్లో సోమవారం జీవన్ రెడ్డి పెద్ద ఎత్తున 'ప్రజా ఆశీర్వాద యాత్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ గ్రామంలో ఆయన ఇంటింటికి వెళ్లి మళ్లీ బీఆర్ఎస్ కే పట్టం కట్టాలని, తనను దీవించాలని ఎన్నికల ప్రచారం చేశారు. అన్ని గ్రామాల్లో ఆయనకి ప్రజలు నీరాజనాలు పట్టారు. డప్పు,వాయిద్యాలు, మేళ తాళ్లాలతో ప్రజలు మంగళ హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో జరిగిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడుతూ తనకు అభివృద్ధి, ప్రజాసంక్షేమం తప్ప మరో పనిలేదన్నారు.

"ఆర్మూర్ గడ్డపై రౌడీయిజం సాగదు. కాంగ్రెస్ ఒక చీడ..బీజేపీ ఒక పీడ. ఈ రెండు అవినీతికర, అవకాశవాద పార్టీల దరిద్రం మనకు అవసరమా? "కారు"జోరులో కాంగ్రెస్, బీజేపీ పరారు కావడం ఖాయం. అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్ కవచ కుండలాలు. గులాబీ జెండా తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక. కేసీఆర్ ప్రజా పక్షం..కాంగ్రెస్ ఒక విష వృక్షం. "కారు"కు ఓటు అభివృద్ధికి రూటు. ఆర్మూర్ అభివృద్ధి ముందుకు సాగాలంటే మళ్లీ నన్ను దీవించండి" అని జీవన్ రెడ్డి ప్రజలను కోరారు.

'కొత్తగా డొంకేశ్వర్, ఆలూరులను మండలాలుగా మార్పించా. గొల్ల, కురుమ సోదరులకు గొర్రెల యూనిట్లు మంజూరు చేయించా.. రైతుబీమా వస్తోంది. 450 కోట్ల రూపాయలు ఖర్చు చేసి మొత్తం నియోజకవర్గంలోని 81 గ్రామాలకు, 36 వార్డులకు ఇంటింటికీ మిషన్ భగీరథ మంచి నీళ్ల సరఫరా చేస్తున్నాం. రూ. 120కోట్లతో పత్తేపూర్-చేపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును సాధించా. కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ ద్వారా ఒక లక్షా 116 రూపాయల చొప్పున ఇస్తూ 15వేల నుంచి 20వేల మంది పేదింటి ఆడ పిల్లల పెండ్లిండ్లు చేసినట్టు తెలిపారు. ఇంతటి అభివృద్ధి గతంలో ఎన్నడూ చూడలేదని అన్నారు.


హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

బస్సులు లేక ప్రయాణికులకు పాట్లు


బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

నవతెలంగాణ-గాంధారి

కామారెడ్డి జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో ఎద్దఎత్తున తరలివెళ్లారు. వందలాది ఆర్టీసీ బస్సులను ప్రజా ఆశీర్వాద సభ కోసం పంపడంతో గాంధారి బస్టాండ్‌లో వేలాది మంది ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ప్రతినిత్యం గాంధారి బస్టాండ్ మీదుగా కామారెడ్డి బాన్సువాడ నిజామాబాద్ లింగంపేట్ వేలాది మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. ప్రతిరోజు కామారెడ్డి బాన్సువాడకు 20 నిమిషాలకు ఒక ఉండే బస్సు ఈరోజు రెండు మూడు గంటలకు ఒక బస్సు రావడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. లింగంపేట్, నిజామాబాద్ బస్సులు ఎలాంటి సమాచారం లేకుండా బస్సులు బంద్ చేయడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. అవకాశం దొరికింది తడవుగా ప్రైవేట్ వాహనాలు ప్రయాణికుల దగ్గర రెట్టింపు డబ్బులను వసూలు చేశారు.

క్షతగాత్రులకు సహాయం అందించిన ఎమ్మెల్యే


క్షతగాత్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

ఎల్లారెడ్డి మండల వెల్లుట్ల గ్రామానికి చెందిన హన్మండ్లు అతని మనుమరాలు అంకితను తాడ్వాయి హాస్టల్ కి సోమవారం పంపడానికి వెళ్తుండగా లింగంపెట్ సమీపంలో కట్టు కాలువ వద్దరోడ్డుపై బైక్ ప్రమాదం జరిగి తీవ్ర గాయాలపాలైయ్యారు. కామారెడ్డి వైపుగా వెళ్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ చూసి వెంటనే ఆగి వారిని తన కాన్వాయ్ వాహనంలో లింగంపెట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి లోని డాక్టర్ తో మాట్లాడి వెంటనే వారికి చికిత్స ఖర్చులు అన్ని తనే చూసుకుంటానని మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

రూ. 2.50 లక్షలు పటివేత

నవతెలంగాణ-మాక్లూర్

మండలం లోని పోలీసు స్టేషన్ రోడ్డుపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా రూ. 2.50 లక్షలు పట్టుకున్నట్లు ఎస్సై సుదీర్ రావు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం మధ్యాహ్నాం సమయంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మాదాపూర్ గ్రామానికి చెందిన రావుల చంద్ర కరణ్ రూ. 2,50 లక్షలు తన వెంట తీసుకెళ్తూ పట్టుబడ్డారు. ఈ డబ్బులకు అతను ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో ఆ డబ్బులను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలపై ఐటి అధికారులకు అప్పగించినాట్లు ఎస్సై తెలిపారు.


నగదు స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ

సౌదీ అరేబియాలో రామచంద్రపల్లి వాసి మృతి


కుటుబానికి నిత్యావసరాలు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

బతుకు భారమై పొట్టకూటి కోసం విదేశాలకు వెళ్లి కాయా కష్టం చేసి కుటుంబాన్ని పోషించాలని భార్య పిల్లలను విడిచివెళ్లిన వ్యక్తిని కాలం కాటేసింది. అతడినే నమ్ముకున్న కుటుంబం రోడ్డుపాలయింది. ఆలూర్ మండలం రామచంద్రపల్లి గ్రామానికి చెందిన పస్తం ఇస్తారి (40) సౌదీ అరేబియా(ధామం)లో గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య పస్తం పద్మ, కూతురు పల్లవి, కొడుకు అభిలాష్ ఉన్నారు. వీరి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి 50కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను గంధం చిరంజీవి అందజేశారు. ఆర్మూర్ మండల ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సౌదీలో చనిపోయిన పస్తంఇస్తారి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి జిల్లా గోసంగి సంఘం అధ్యక్షులు గంధం రాజేష్, నాయకులతో మాట్లాడి మృతదేహాన్ని రామచంద్రపల్లి గ్రామానికి వచ్చేలా చూస్తామని అన్నారు. కార్యక్రమంలో గంధం రాములు, ఆంద్రాశి వినోద్, ఎల్లయ్య, సాయిలు, గోసంగి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ప్రచారం


మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలంలోని మౌలాలి తండా, తాడు బిలోలి, బోర్గం గ్రామాలలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. యువత అత్యధిక సంఖ్యలో కాంగ్రెస్ కండవాలను కప్పుకున్నారు. ఆరు గ్యారెంటీ పథకాలకు ప్రజలు ఆకర్షితులై కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్, సీనియర్ నాయకులు సిహెచ్ రాములు, నాగభూషణం రెడ్డి, జావిద్ ఉద్దీన్, జి సాయి రెడ్డి, ధనుంజయ్, లచ్చే వార్ నితిన్, అంజయ్య, యువత కార్తిక యాదవ్, సల్మాన్ ఖాన్, సిద్ధ సాయిలు, రాకేష్, ఎల్ కృష్ణ, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 4న న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

నవతెలంగాణ-ఆర్మూర్

భారత రాష్ట్ర సమితి పార్టీకి మద్దతుగా తెలంగాణ రాష్ట్ర న్యాయవాదులు హైదరాబాద్‌లోని జలవిహార్ వద్ద నాలుగో తేదీన న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు లీగల్ సెల్ కన్వీనర్ ఎంకే నరేందర్ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వినోద్ కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జక్కుల శ్రీధర్, ఆవారి రమేష్, కాందేశ్ సంగీత, గణేష్, జి.జి.రామ్, బండారి దాస్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మొన్న తిరుగుబాటు..
నేడు సర్దుబాటు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని వజ్జాపల్లి గ్రామంలో మొన్న తిరుగుబాటు చేసిన ప్రజలకు గ్రామంలోని బీఆర్ఎస్ కార్యకర్తలకు సర్దుబాటు చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం బీఆర్ఎస్ నాయకులు గ్రామంలోని ప్రతి వాడల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మేనిఫెస్టో కార్యక్రమాలను గతంలో చేసిన అభివద్ధి పథకాలను వివరించి ఓటు వేయాలని అభ్యర్థించారు.


మేనిఫెస్టో కరపత్రాల చూపుతున్న ప్రజలు

హత్యాయత్నాన్ని ఖండించిన మంత్రి వేముల

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఎన్నికల ప్రచారం చేస్తుండగా.. దుండగుడు కత్తితో దాడి చేసిన ఘటనను మంత్రి వేముల తీవ్రంగా ఖండించారు. రాజకీయాల్లో, ప్రజాస్వామ్యంలో హత్యా రాజకీయాలకు తావులేదని, బాధ్యులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభాకర్ రెడ్డి త్వరగా కోలుకోవాలని మంత్రి వేముల ఆకాంక్షించారు.

బీఆర్‌ఎస్‌కు యువత నుండి విశేష స్పందన

- రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- మంత్రి వేముల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు యువకులు



మంత్రి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన యువకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బీఆర్ఎస్‌కు యువత నుండి విశేష స్పందన లభిస్తుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహనిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు. సోమవారం వేల్పూర్‌లోని మంత్రి నివాసంలో ముఖ్యమంత్రి కేసిఆర్ జనరంజక పాలన, బాల్కొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. భీంగల్ మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ బాల గంగాధర్ ఆయన అనుచరులు, బీజేపీ పార్టీ నుండి వడ్ల సంఘం అధ్యక్షుడు ముప్పురం శ్రీధర్ ఆయన అనుచరులు, భీంగల్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, బాబాపూర్ 9వ వార్డు మెంబర్ ఎం.డి హఫీజ్ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. అదేవిధంగా బాల్కొండ ఏ.బి నగర్ నుండి లయన్స్ యూత్, ఏ.బి బాయ్స్ యూత్ సభ్యులు, మోర్తాడ్ మండలం పాలెం గ్రామం నుండి బుల్స్ యూత్, యంగ్ బ్రదర్స్ యూత్, యువ మాదిగ సేన యూత్ సభ్యులు, కాంగ్రెస్, బీజేపీ కి చెందిన పలువురు నాయకులు, యువకులు పెద్ద ఎత్తున సుమారు 200 మంది మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి మంత్రి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూడు పేకాట స్థావరాలపై దాడులు

- 24 మంది అరెస్ట్, 84 వేల నగదు స్వాధీనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాకేంద్రంలో మూడుపేకాట స్థావరాలపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆదివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసిపి రాజశేఖర్ రాజు, సిఐలు అంజయ్య, అజయ్, తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఆరోటౌన్ పరిధిలోని రెండు ఆటోనగర్ నయా బ్రిడ్జి, అర్సపల్లి, ఐదవ టౌన్ పరిధిలోని ఖిల్లా గోశాల రోడ్డు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 24 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 84,110 నగదు, సెల్ ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీస్టేషన్‌లో వారిని అప్పగించారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రాములు, రామచందర్, అనిల్, భూషణ్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బాల్కొండ

బీఆర్ఎస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై 50మంది యువకులు పార్టీ లో చేరినట్లు మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి తెలిపారు. సోమవారం బాల్కొండ మండల కేంద్రానికి చెందిన ఏబి బాయ్స్ యూత్, లయన్స్ యూత్ సభ్యులు, మైనారిటీ యువకులు మంత్రి ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు సిరికంటి సాగర్ యాదవ్, ఎంపీటీసీ లు మామిడి రాకేష్, కన్న పోశెట్టి, ఉప సర్పంచ్ షేక్ వాహబ్, ద్యావతి మురళి, పిట్ల దయాకర్, గువ్వల గంగా ప్రసాద్, ద్యావతి రవి, బోడ శ్రీనివాస్, బోడ కార్తీక్, యువకులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస శిక్షణలో

హసకొత్తూర్ వాసికి జేసీఐ రాష్ట్ర ఉత్తమ పురస్కారం



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హసాకొత్తూరు గ్రామానికి చెందిన ఉట్నూర్ నరేష్‌కు వ్యక్తిత్వ వికాస శిక్షణలో అంతర్జాతీయ సంస్థ జెసిఐ రాష్ట్ర ఉత్తమ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లో జరిగిన రెండు రోజుల రాష్ట్రస్థాయి జోన్ కాన్ఫరెన్స్‌లో ఉత్తమ అవార్డుతో నరేష్‌ను సత్కరించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమాలు, విద్యార్థులకు, యువతకు కెరియర్ గైడెన్స్ పైన ఉత్తమ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకుగాను జూనియర్ ఛాంబర్స్ ఇంటర్నేషనల్ ఇండియా, నిజామాబాద్ స్ఫూర్తి క్లబ్బు ఆధ్వర్యంలో అవార్డుతో సన్మానించారు. రాష్ట్రస్థాయిలో అవార్డును పొందినందుకుగాను జూనియర్ ఛాంబర్స్ ఇంటర్నేషనల్ ఇండియా, నిజామాబాద్ స్ఫూర్తి క్లబ్బు ప్రతినిధులను జోన్ ప్రెసిడెంట్ విధిగుప్త, జెసిఐ నిజామాబాద్ స్ఫూర్తి ప్రెసిడెంట్ లాబిశెట్టి మహేష్, సెక్రటరీ వజ్జ మహేందర్, ట్రెజరర్ మల్లెపూల విఠళేశ్వర్, డైరెక్టర్ ఉట్నూర్ నరేష్, జాలిగామ శ్రీకాంత్‌లను జెసిఐ జోన్ ప్రతినిధులు అభినందించారు. మారుమూల గ్రామంలో ఉండి కూడా అంతర్జాతీయ సంస్థలో డైరెక్టర్ గా సేవా, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉట్నూరు నరేష్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడుతూ ప్రత్యేకంగా అభినందిస్తూ, అవార్డును ప్రధానం చేశారు.

నా మట్టి-నా దేశం' వేడుకల్లో వేంపల్లి యువకులు

నవతెలంగాణ-ముప్కాల్



మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన బొత్తమొల్ల నరేష్, ద్యాగ మనో జ్, అమ్మక్కపేట కిషన్ దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన 'నా మట్టి -నా దేశం' కార్యక్రమం ముగింపు వేడుకలో పాల్గొన్నారు. గత శనివారం రాజ్ భవన్‌లో జరి గిన 'నా మట్టి -నా దేశం' కార్యక్రమంలో పాల్గొని న్యూఢిల్లీలో జరిగే 'నా మట్టి -నా దేశం' కార్యక్రమంకు ఎన్నికయ్యారు. గ్రామస్తులు వారి ఎంపికపై హర్షం వ్యక్తం చేశారు.

ప్రజల మౌలిక సమస్యలను మ్యానిఫెస్టోలో పెట్టాలి

- సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాస్

నవతెలంగాణ-ఆర్మూర్

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాజకీయ పార్టీలు ప్రజా మౌలిక సమస్యలను మేనిఫెస్టోలో పెట్టాలని దాసు డిమాండ్ చేశారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ఎన్నికలు-ప్రజా సమస్యలు అనే అంశంపై సదస్సును సోమవారం పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ హాల్లో సబ్ డివిజన్ కార్యదర్శి సూర్య శివాజీ అధ్యక్షతన నిర్వహించారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పార్టీలు ప్రజా మౌలిక సమస్యలపై నిర్దిష్ట హామీతో మేని ఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ అధికారంలోకి రాగానే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులకు మరణ శాసనం లిఖించారని ఆయన అన్నారు. కెసిఆర్ ఇంటికో ఉద్యోగం, రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పేరుతో ఉన్న మూడు లక్షల ఉద్యోగ కార్మికుల్ని క్రమబద్ధీకరిస్తామనే హామీ నీళ్ల మూటగా మారిందన్నారు. నిరుద్యోగ భృతి 3016 రూపాయలు అమలుకు నోచుకోలేదని ఆయన తెలిపాను. ధనవంతమైన రాష్ట్రం అంటూ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ పథకం అంటూ ఊరించి చెప్పిన లక్షలాదిమంది కార్మికులకు నిలువ నీడ లేకుండా చేశారని ఆయన విమర్శించారు. దేశంలో ఉన్న 40 కోట్ల ఉద్యోగ, కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేసేటట్లు బిజెపి, కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మిగులు భూములు పేదలకు పెంచాలని, ఉద్యోగ భర్తీలు చేసి ఉపాధి భద్రత కాపాడాలని, విద్య వైద్యరంగ సమస్యలను పరిష్కరించాలని, పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలని కాపాడాలని దాసు డిమాండ్ చేశారు. సదస్సులో న్యూ డెమోక్రసీ ఆర్మూర్ డివిజన్ నాయకులు యండి. ఖాజా మైనోద్దీన్, అరుణోదయ జిల్లా అధ్యక్షులు, సురేష్ బాబు, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రిన్స్, పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.వెంకటేష్ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు చిట్టక్క, మణెమ్మ, బుజ్జి మహిళా సంఘం నాయకులు ఎం లక్ష్మి, హైమది ఐఎఫ్టియు నాయకులు గంగాధర్, పాషా బాయ్ ప్రజా సంఘాల నాయకులు పి రాజేశ్వర్, లోకేష్, అలీమ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ల ప్రచారం

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్ బిగాల గెలుపు కోసం నిజామాబాద్ నగరంలో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జిలు, నాయకులు, కార్యకర్తలు సోమవారం ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎమ్మెల్యే గణేష్ బిగాల నాయకత్వంలో నిజామాబాద్ నగరం జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి కారు గుర్తుకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి చేరికలు



నవతెలంగాణ-మెండోర

బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల.సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో కొడిచర్ల గ్రామంలో పలువురు చేరారు. మెండోర మండలం కోడిచర్ల గ్రామానికి చెందిన గడ్డం.సంతోష్ రెడ్డి, కే.దేవేందర్ , మాజీ సర్పంచ్ నడిపి రెడ్డి, వారితోపాటు 50 మంది మాజీ సొసైటీ ఛైర్మన్ కృష్ణరెడ్డి ఆధ్వర్యంలో మరో యాభై(50) మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అరాచక, అవినీతి తాండవిస్తుందని, ప్రశాంత్‌రెడ్డిపై ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయారని అన్నారు. నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ రెడ్డి గెలుపును కాంక్షిస్తు పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుమల కష్టాలు తీరుస్తా

- మళ్ళీ ఆశీర్వాదించండి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-నందిపేట్

వచ్చేఎన్నికల్లో భారీమెజార్టీతో తనను గెలిపించాలని గెలిచిన వెంటనే కురుమల కష్టాలు తీరుస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలో నియోజకవర్గ కురుమల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం గొల్లకురుమలకు గొర్లు పంపిణీ చేసిందన్నారు. కురుమలు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించాలనేదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వాలు గొల్ల కురుమ ప్రజలను ఎన్నడు పట్టించుకోలేదని, కురుమల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం 12వేల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందన్నారు. రూ.మూడు కోట్ల రూపాయలతో కురుమ ఫంక్షన్ హాల్ కట్టించానన్నారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే మీ కోసం జీతగాడిలా పని చేస్తానన్నారు. సమ్మేళనంలో 32 గ్రామాల కురుమ ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కురుమ నాయకులు రాజారాం యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తొండకూర్ దేవన్న , జనరల్ సెక్రెటరీ మంతన ముత్యం, నియోజకవర్గ అధ్యక్షులు కేజీ సురేష్, ఆయా మండలాల అధ్యక్షులు పోతన్న, బోజన్న, గంగన్న, ఆశన్న, మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ హనుమంత్ షిండేనే గెలిపిస్తాం

నవతెలంగాణ-మద్నూర్

హనుమంత్ షిండేనే మళ్లీ గెలిపిస్తామని అవల్‌గావ్ సర్పంచ్, ఎంపీటీసీ తెలిపారు. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజా ఆశీర్వాద సభ జుక్కల్ మండలంలోని జుక్కల్ చౌరస్తాలో నిర్వహించారు. ముఖ్యమంత్రి సభ విజయవంతానికి మద్నూర్ మండలంలోని అవల్గావ్ సర్పంచ్ శాంతిశ్వర్, ఎంపీటీసీ సాయిలు ఆధ్వర్యంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

సరైన పత్రాలు లేకుండా నగదు తీసుకెళ్లొద్దు

- ఎస్ఐ తిరుపతిరెడ్డి

నవతెలంగాణ-జుక్రాన్‌పల్లి

సరైన పత్రాలు లేకుండా నగదు తీసుకెళ్లొద్దని తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పడకల్ గ్రామంలో సరైన పత్రాలు లేకుండా నగదు ఉన్న వ్యక్తి నుండి నగదు రూ.76800 స్వాధీన చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా వాహనదారులు సరైన పత్రాలు లేకుండా నగదు కానీ, విలువైన వస్తువులు కాని వెంట తెచ్చుకోవద్దని అన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరికలు

- ఆహ్వానించిన డాక్టర్ భూపతి రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న భూపతిరెడ్డి

మండలం లోని సుద్దలం, మిట్టపల్లి గ్రామలకు చెందిన పలువురు బిఆర్ఎస్, బిజెపి పార్టీలను వీడి మాజీ ఎమ్మెల్సీ, నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భూపతిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కండువాలు వేసి ఆహ్వానించారు.రాబోవు ఎన్నికల్లో భూపతి రెడ్డి విజయమే లక్ష్యంగా పని చేస్తు కాంగ్రెస్ అదిష్ఠానం ప్రకటించిన 6గ్యారంటి స్కీమ్ లను ప్రజల్లోకి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

జుక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బిజెపి, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ భూపతిరెడ్డి సమక్షంలో 60 మంది కాంగ్రెస్ చేరడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వసంతరావు, యువజన విభాగం అధ్యక్షుడు సొప్పరి వినోద్, నర్సారెడ్డి బాలయ్య, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రం ఏర్పడటం వల్లే ఉన్నత పదవులు

- ఏరోళ్ళ శ్రీనివాస్
- మధుశేఖర్‌నీ స్ఫూర్తి తీసుకోవాలి
- ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి
- అంబేద్కర్ ఆశయాల కోసం కృషి చెయ్యాలి
- మల్లెపల్లి లక్ష్మయ్య

నవతెలంగాణ-భీమ్‌గల్


నివాళి అర్పిస్తున్న పలువురు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు వల్లే అన్ని వర్గాలకు పదవులు వచ్చాయని తెలంగాణ రాష్ట్ర మెడికల్ సర్వీసెస్, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ చైర్మన్ ఎర్రోళ్ళ శ్రీనివాస్ అన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన డా. బద్దం మధుశేఖర్ కి దళిత ఐక్య సంఘటన అధ్వర్యంలో సోమవారం పట్టణ కేంద్రంలోని సహస్ర ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ రిక్క లింబాద్రి తో కలిసి ఎర్రోళ్ళ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ రంగంలో ఏ ప్రభుత్వ ఉద్యోగి ఎటువంటి ట్రైనింగ్ జరగాలన్న డా. మధు శేఖర్ చైర్మన్‌గా ఉన్న సంస్థ ద్వారానే ట్రైనింగ్ తీసుకోవాలని, అలాంటి పదవి రావడం గొప్ప విషయమన్నారు. స్వరాష్ట్రంలోనే దళితులకు ఉన్నత పదవులు వచ్చాయని, దానికి ఉదాహరణనే తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ గా ఉన్న రిక్క లింబాద్రి కి సీఎం కేసిఆర్ అవకాశం ఇచ్చారని అన్నారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఏ ఒక్కరికీ కూడా దళితుడికి ఉన్నత విద్య మండలి చైర్మన్‌గా అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారు.అతి చిన్న వయసులో ఉన్న తనకి కూడా ఎస్సీ కమిషన్ చైర్మన్ అవకాశం ఇచ్చిన గొప్ప వ్యక్తి సియం కేసిఆర్ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర రాజధానిలో నడి బొడ్డున 125 అడుగుల విగ్రహం కట్టడం, తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి డా.బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టడానికి కృషి చేసిన ముఖ్యమంత్రి కేసిఆర్, రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఉన్నత విద్య మండలి చైర్మన్ రిక్క లింబాద్రి మాట్లాడుతూ ఆర్మూర్ ప్రాంత ప్రజల కోసం వైద్యం అందించాలని 1992 లోనే హాస్పిటల్ ఏర్పాటు చేసి డా. మధు శేఖర్ సేవలు అందిస్తున్నారాని దాదాపు 45 ఉచిత మెగా సర్జికల్ క్యాంప్ ద్వారా ఎందరికో ఉచిత ఆపరేషన్లు చేసిన ఘనత డా.మధు శేఖర్ అని తెలిపారు.ఈ సేవలు గుర్తించి ముఖ్యమంత్రి కేసిఆర్ రాష్ట్ర చైర్మన్ పదవి ఇచ్చారని, ఈ పదవి కోసం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కృషి చేశారని గుర్తు చేశారు. అందరూ కూడా డా.మధు శేఖర్ నీ స్ఫూర్తిగా తీసుకొని తమ పిల్లలను ఉన్నత చదువు చదివించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ వచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకోవాలని బ్రిటిష్ ప్రభుత్వం హయాంలో కూడా బాబాసాహెబ్ అంబేద్కర్ వచ్చిన అవకాశంని సద్వినియోగం చేసుకొని దళిత అభ్యున్నతి కోసం కృషి చేశారని గుర్తు చేశారు. దళిత్ ఫర్ సెంట్రల్ స్టడీస్ కోసం 9 అంతస్తుల భవనం రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అధ్వర్యంలో నిర్మించడం జరిగిందన్నారు. నాగార్జున సాగర్ లో బుద్ధవన అభివృద్ధి కోసం కృషి చేసిన సియం కేసిఆర్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్ డా.మధు శేఖర్ మాట్లాడుతూ నా సేవలు గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో అసమానతలు తొలగిపోవాలంటే కేవలం చదువుతోనేనని, జ్ఞానం సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా టిఎన్ జిఓ అధ్యక్షుడు అలుక కిషన్, మానస గణేష్, డా.అశోక్,-డా.నాగరాజు, కవి, రచయిత రెంజర్ల రాజేష్, గడల ప్రసాద్, పర్స నవీన్, మాణిక్యాల శ్రీనివాస్, పసుల ముత్తెన్న, పొడేవు శంకర్,కన్నె సురేందర్, కల్లెడ ఏలీయా, కౌన్సిలర్లు, బాల్కొండ నియోజకవర్గ సర్పంచులు, ఎంపిటిసిలు,దళిత నాయకులు పాల్గొన్నారు.

వర్సిటీ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్‌గా డా.పాత నాగరాజు

- నియామకపు ఉత్తర్వులు అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి


నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న దృశ్యం

తెలంగాణ యూనివర్సిటీ ఇంచార్జీ వైస్ ఛాన్సలర్ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి అర్థశాస్త్ర విభాగానికి చెందిన సహ ఆచార్యులు డాక్టర్ నాగరాజు పాతకు ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్‌కు డైరెక్టర్‌గా ఉత్తర్వులను సోమవారం అందజేశారు. డాక్టర్ నాగరాజు గతంలో అర్థశాస్త్ర విభాగాధిపతిగా, పాఠ్య ప్రణాళిక సంఘ అధ్యక్షులుగా, పరీక్షల విభాగంలో అడిషనల్ కంట్రోలర్‌గా, కంట్రోలర్‌గా సుదీర్ఘకాలం బాధ్యతలు నిర్వహించారు. పరీక్షలు, మూల్యాంకనం పారదర్శకంగా నిర్వహించడంలో బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆన్లైన్లో మూల్యాంకనం ప్రారంభించారు. పరీక్షల విభాగంలో కీలకంగా పనిచేసి న్యాక్ గుర్తింపులో ప్రధాన భూమిక పోషించారు. సారంగపూర్‌లోని బిఎడ్ కాలేజీ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించి ఉన్నత అధికారుల మన్ననలు పొందారు. సాంకేతికతకు కనుగుణంగా పోటీ పరీక్షల్లో విద్యార్థులకు శిక్షణ నిచ్చి వారిలో నైపుణ్యాలను అభివృద్ధిపరిచి కంపెనీలను విశ్వవిద్యాలయానికి ఆహ్వానించి విద్యార్థులకు ప్లేస్మెంట్ అవకాశం కల్పించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యం యాదగిరి మార్గనిర్దేశం చేశారు. డా. పాత నాగరాజు డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పలువురు అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ బేస్ బాల్ పోటీల్లో రాణించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి


ఎంపికైన క్రీడాకారులు

ఈనెల 01 నుండి 06 వరకు లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ పంజాబ్ రాష్ట్రంలో జరగనున్న బేస్ బాల్ ఎంఎల్‌బి ఛాంపియన్ పోటీలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుండి కె.కిషోర్, ఇ. శ్రీశాంత్ బయలుదేరుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు సుశీల్ కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ పోటీల్లో రాణించి అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావాలన్నారు. మిట్టపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, సర్పంచ్ తేలు గణేష్, డిచ్‌పల్లి మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, మాజీ ఎంపీటీసీ ఒడ్డెం నర్సయ్య, సాఫ్ట్వేర్ ఇంజనీర్ కంచెట్టి మహేష్, ఎస్ఎంసి చైర్మన్ మాస్పెద్ది శ్రీనివాస్, మాస్పెద్ది రాజన్న, మస్పెద్ది రవి, గోపు రాజేశ్వర్, డాక్టర్ కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు రాఘవేందర్ క్రీడాకారులకు ఆర్థిక సహాయం అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మర్కంటి గంగా మోహన్ పాల్గొన్నారు.

సెపక్ తక్రా నేషనల్ గేమ్స్‌కు రిక్కీ రెడ్డి, సాయి శ్రీ

నవతెలంగాణ-కంఠేశ్వర్


ఎంపికైన క్రీడాకారులు

గోవాలో జరుగుతున్న 37 వ నేషనల్ గేమ్స్ కు జిల్లాకు చెందిన చామకూర రిక్కీ రెడ్డి, సాయిశ్రీ ఎంపికయినట్లు జిల్లా సెపక్ తక్రా కార్యదర్శి గాదారి సంజీవ్ రెడ్డి తెలిపారు. అక్టోబర్ 13న హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో జరిగిన ఎంపికల్లో 18 మంది క్రీడాకారినులను ఎంపిక చేసి వారికి క్యాంప్ నిర్వహించి ప్రతిభ కనబర్చిన క్రీడాకారినులను ఎంపిక చేశారని అన్నారు. ఎంపిక చేసిన వారిలో జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారినులు ఉన్నారని తెలిపారు. వీరి ఎంపిక పట్ల జిల్లా సెపక్ తక్రా అధ్యక్షులు కేశ వేణు, ఉపాధ్యక్షులు ల్యాబ్ గంగా రెడ్డి, దీపిక, సతీష్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు మీసాల ప్రశాంత్ కుమార్, గణేష్, ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ చామ కూర భాగారెడ్డి, కోచ్ శ్యామ్ సుందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

రూ.30 ఖర్చవుతుంటే.. రూ.10 చెల్లిస్తారా..?

- రూ.30 చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ (సిఐటియు) వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్


వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

మధ్యాహ్న భోజన కార్మికులకు గైడెన్స్ లేని బ్రేక్‌ఫాస్ట్‌ను ప్రతి పాఠశాలలో అమలు చేయాలని, మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిజామాబాద్ డిఈఓకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడు తూ.. నూతన కేసీఆర్ బ్రేక్ ఫాస్ట్ స్కీము ప్రతి పాఠశా లలో అమలు చేయాలని, ఉదయం జావా, పూరి, ఇడ్లీ, దోశ, వడ ఇలా రోజుకో విధంగా విద్యార్థులకు భోజనం అందించాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కానీ వంట చేస్తున్న కార్మికులకు మాత్రం ఒక విద్యార్థికి కనీసం 30 రూపాయలకు ఖర్చు అవుతుందని అన్నారు. కానీ ప్రభుత్వము మాత్రం పది రూపాయల 50 పైసలు ఇస్తానని చెప్పడము సిగ్గుచేటని అన్నారు. సరుకులన్నీ 10 రూపాయల 30 పైసలకే స్లాబ్ రేటుగా నిర్ణయించడం అనేది శ్రమ దోపిడీ అవుతుందని తెలిపారు. ఒక విద్యార్థికి 30 రూపాయల స్లాబ్ రేటు 3000 గౌరవ వేతనము తక్షణమే అమలు చేయా లని అన్నారు. గతంలో ఉన్న బకా యిలను వెంటనే విడుద ల చేస్తూ సీఎం ప్రకటిం చిన మూడు వేల వేతనాన్ని జనవరి నుండి అమలు చే యాలని తెలిపారు. లేకుంటే మధ్యాహ్న భోజన కార్మికులు అప్పుల పాలయ్యే అవకాశం ఉంటుందన్నా రు. విద్యార్థికి 30 రూపాయల రేటు తక్షణమే మూడు వేల అమలుచేసి ఈ స్కీమును ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండగంగాధర్, జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి రాములు చారి, జిల్లా ఉపాధ్యక్షులు సురేందర్ రెడ్డి ఎడపెల్లి లక్ష్మి తుకారం, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రంగంలోకి దిగిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఉమ్మడి జిల్లాలో మూడు మండలాలకు ఒకటి చొప్పున ఫ్లైయింగ్ స్కాట్ బృందాలను ఏర్పాటు చేశారు. వీరి వాహనంకు 360 డిగ్రీల కోణంలో దృశ్యాలను కవర్ చేసే విధంగా కెమెరాను ఏర్పాటు చేశారు.ఇక్కడ రికార్డ్ అయిన వివరాలు కొత్త టెక్నాలజీ ద్వారా ద్వారా నేరుగా ఎన్నికల కేంద్రానికి కలెక్టర్ కార్యాలయానికి ఆర్డిఓ కార్యాలయానికి క్షణక్షణం చేరుతుంది. 24 గంటలు పాటు ఈ వాహనం సంచరిస్తూనే ఉంటుంది. అంతేకాకుండా వీరి వెంట అదనంగా కెమెరామెన్ కూడా ఏర్పాటు చేశారు.

c m y k

ప్రజారంజక పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం

కాంగ్రెస్ అభ్యర్థి వినయ్ కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న వినయ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-డొంకేశ్వర్

ప్రజారంజక పాలన కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యం అని కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి- వినయ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారం లో భాగంగా సోమవారం కాంగ్రెస్ శ్రేణులు డొంకేశ్వర్ మండలం మారంపల్లీ, గంగాసరం, చిన్నయానం, గాదెపల్లీ, నడుకుడ, అన్నారం - సిర్పూర్ గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ జెండా ఎజెండా గురించి ప్రజలకు వివరించారు. ప్రతీ పల్లె, ప్రతీ గ్రామం ఒకటే నిర్ణయం తో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ తెలంగాణకు నెల రోజుల్లో మంచి రోజులు రానున్నాయని, కాంగ్రెస్ పాలన కోసం జనం అంతా వేచి చూస్తున్నారని తెలిపారు. ఆర్మూర్‌లో ఎక్కడా కూడా అభివృద్ధి జరగలేదు అని, ఒక్క నిరుద్యోగికి ఉద్యోగం రాలేదదని, కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రాగానే రెండు లక్షల ఉద్యోగ నోటిఫికేషన్లు ఉంటాయని అన్నారు. ప్రతీ గ్రామం అభివృద్ధి నా బాధ్యత అని చెప్పారు. ఈ దుర్మార్గపు పాలన కు చరమగీతం పాడేందుకు నా నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో సతీమణి అన2న్య మండల అధ్యక్షుడు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా రావులపల్లి జగదీశ్వర్ రావు



నూతన అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న సభ్యులు



జగదీశ్వర్‌రావు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది రావులపల్లి జగదీశ్వర్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మర్చంట్ అసోసియేషన్ నిజామాబాద్ భవనంలో సంస్థ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల సమావేశానికి ఎన్నికల అధికారులుగా శ్రీ కుమార్ శర్మ, శ్యామ్ అగర్వాల్, ఏ.హరిప్రసాద్, పూర్వ అధ్యక్షులు మోటూరి దయానంద్, భక్తవత్సల్యం, వెంకట నర్సాగౌడ్, దినేష్ రెడ్డి సమన్వయ కర్తలుగా వ్యవహరిస్తు ఎన్నికలను నిర్వహించారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా రావులపల్లి జగదీశ్వర్ రావు (సీనియర్ న్యాయవాది), ఉపాధ్యక్షుడిగా సి.విజయ్ కుమార్(రాజు), ప్రధాన కార్యదర్శిగా కమల్ ఇనాని, సహాయ కార్యదర్శిగా సూరజ్ అగర్వాల్, కోశాధికారిగా హితేన్ భీమని, కార్యవర్గ సభ్యులుగా డి.నరసింహారెడ్డి, గోపాల్ సోనీ, జి.పద్మనాభ రెడ్డి, రాజీవ్ దువ్వ, బి.దేవిదాస్, వి.శ్రీనివాసరావు, ఎస్.దర్శన్ సింగ్, ఏ.హరిప్రసాద్, డాక్టర్ జి.కౌలయ్య, డాక్టర్ ఎ.విశాల్,పి.రామ్ రెడ్డి, ధర్మేంద్ర గాంధీ, ఎస్.పృథ్వీరాజ్ గౌడ్, పి.వినోద్ కుమార్. పి.శివప్రసాద్. ఎన్.మధు సూదన్, పి.రాజేందర్‌ను ఎన్నుకు న్నారు. ఈసందర్భంగా అధ్యక్షుడు రావులపల్లి జగదీశ్వర్ రావు మాట్లాడుతూ చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు నాయకులు, అధికారుల సౌజన్యంతో, సహకారంతో రైల్వే బ్రాడ్ గేజ్ సమస్యని సాధించామని తెలిపారు. రానున్న రోజుల్లో నిజామాబాద్ యువత కోసం పరిశ్రమల కోసం ముందడుగు వేస్తామని ఆయన అన్నారు.

కాంగ్రెస్ హయాంలో కులవృత్తులపై నిర్లక్ష్యం

మత్స్య సంపదను పెంపు చేసిన ఘనత సీఎం కేసీఆర్ దే
రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



బాజిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న గంగపుత్రులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

50 ఏళ్ల రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ నాయకులు కులవృత్తులను సర్వనాశనం చేశారని, తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ కులవృత్తులకు పెద్ద పీట వేశారని రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. సోమవారం డిచ్ పల్లి మండల కేంద్రంలోని జీ కన్వెషన్లో నిర్వహించిన నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అర్సపల్లిలో విలువైన మత్స్యశాఖ భూమిని కబ్జా కాకుండా కాపాడినట్లు తెలిపారు. ఆ స్థలంలో చేపల మార్కెట్ నిర్మాణం కోసం రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. మత్స్యకార్మికులకు చేపల పెంపకంతో పాటు చేపలు విక్రయించుకునేందుకు రవాణా సౌకర్యం కోసం వాహనాలు అందజేశామన్నారు. రూరల్‌లో వంద మత్స్యకార సొసైటీలు ఉన్నాయని, రెండు వేల మంది సభ్యులున్నారని తెలిపారు. ప్రజల మద్దతుతోనే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. ఐదోసారి అండగా ఉండి భారీ మెజార్టీతో గెలిపించాలని బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రూరల్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ వీ గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కోటి రూపాయలు బడ్జెట్ కేటాయించేవారని, సీఎం కేసీఆర్ బడ్జెట్‌లో వేయి కోట్లు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మత్స్యకారులు తీవ్ర వివక్షకు గురయ్యారని, వారిపై ఉక్కుపాదం మోపారని విమర్శించారు. ఉచితంగా చేపపిల్లల పంపిణి వల్ల తొమ్మిదన్నర ఏళ్ల కాలంలో 8500 వేల కోట్లు చేపలు ఉత్పత్తి చేసి దేశంలోనే తెలంగాణ రికార్డు సాధించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 95వేల చెరువుల్లో 100 శాతం సబ్సిడీపై చేపపిల్లలు ఇవ్వడంతో మత్స్యకారులు ఆర్థికాభివృద్ధిని సాధించారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులను చిత్తుగా ఓడించాలని పిలుపు నిచ్చారు. అంతకు ముందు మత్స్యకారులు బాజిరెడ్డి, వీజీగౌడ్‌కు చేపను బహూకరించి, గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సంటారి మోహన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్ రెడ్డి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ, నాయకులు, ఏడు మండలాల గంగపుత్రలు పాల్గొన్నారు.

సీతారాంపూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సర్పంచ్ స్వరూప ఆధ్వర్యంలో కార్యకర్తలు యువజన నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వరూప మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చేపడుతున్న సంక్షేమ పథకాలు వివరించారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, భారీ మెజారిటీతో సీఎం కేసీఆర్‌ను గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు అసని జ్యోతి, మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముదం గంగయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా గరికెళ్ళి సురేష్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని ఘన్పూర్ గ్రామానికి చెందిన కురికెల్లి సురేష్ కు బిఆర్ఎస్ డిచ్ పల్లి మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ గా నియామక పత్రాన్ని సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ నియామకానికి సహకరించిన యువ నాయకుడు బాజిరెడ్డి జగన్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జడ్పిటిసి దాసరి ఇందిరా లక్ష్మీ నర్సయ్య, సీనియర్ నాయకులు శక్కరి కొండ కృష్ణ, యూత్ అధ్యక్షుడు అమీర్ ఖాన్ లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డం గంగాధర్, సొసైటీ డైరెక్టర్ సతీష్ రెడ్డి, ఉప సర్పంచ్ రంజిత్, సమీర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



నవీపేట్ : ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న చైర్మన్



ఏర్గట్ల పీఏసీఎస్‌లో..

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార అధికారి సింహాచలం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిసిఓ మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలన్నారు. కొనుగోళ్లు సజావుగా సాగేలా సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. క్వింటాలు ఏ గ్రేడ్(1010) వరి ధాన్యానికి రూ. 2203, బి గ్రేడ్(కామన్) వరి ధాన్యానికి రూ.2183 మద్దతు ధరలను ప్రభుత్వం రైతుకు చెల్లిస్తుందన్నారు. అనంతరం ధాన్యం కుప్పలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసిల్దార్ భాస్కర్, సింగిల్ విండో చైర్మన్ రేగుంట దేవేందర్, మండల వ్యవసాయ అధికారి బద్దం లావణ్య, విండో కార్యదర్శి శంకర్, సింగిల్ విండో మాజీ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, రైతులు అవారి గంగారెడ్డి, హల్దే శ్రీనివాస్, కొమ్ముల హనుమంతు పాల్గొన్నారు.

మోపాల్:మండలంలోని మంచిప్ప గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏపీఎం మోహన్ కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర ఇక్కడ లభ్యమవుతుందని. డబ్బులు కూడా తొందరగా వచ్చే విధంగా చూస్తామని ఆయన తెలిపారు. సిసి హరిబాబు , గ్రామ యూత్ అధ్యక్షుడు సాయిరాం, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



మోపాల్: మంచిప్పలో..



జక్రాన్‌పల్లి: పడకల్‌లో...

జక్రాన్‌పల్లి:మండలంలోని పడకల్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ సిఈఓ తిరుపతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సొసైటీ సిబ్బందికి సూచించారు. ధాన్యాన్ని ఆరబెట్టి, చెన్ని పట్టిన అనంతరం తూకం వేయించాలని సూచించారు. సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏర్గట్ల:మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టాపాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లను తీసుకుని రావాలని కోరారు. ఏఈఓ స్నేహ,సంఘ సీఈఓ జక్కని శ్రీనివాస్, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

నవీపేట్:ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధరను పొందాలని బినోల పిఏసిఎస్ కార్యదర్శి మేక రమేష్ అన్నారు. బినోల సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని నాలేశ్వర్, నిజాంపూర్, బినోల, జన్నేపల్లి, మోకన్ పల్లి, అనంతగిరి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆర్ఐ మోహన్, రైతులు పాల్గొన్నారు.

పొతంగల్‌లో పోలీసుల తనిఖీలు


వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-పొతంగల్
మండల కేంద్రంలో ఎన్నికల సందర్భంగా మహారాష్ట్ర నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గం నుంచి పెద్ద జన సంఖ్యాసమీకరణలో భాగంగా ఇతర రాష్ట్ర నుంచి పెద్దసంఖ్యలో వాహనాలు మన రాష్ట్రానికి వచ్చే అవకాశమున్నందున తనిఖీలు చేపట్టారు.

ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరికలు


బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన మీసాన్‌పల్లి గ్రామస్తులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే ఫామ్‌హౌస్‌లో బీఆర్‌ఎస్ పార్టీలోకి మీసాన్‌పల్లి గ్రామస్తులు సోమవారం చేరారు. వీరికి మండల అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని మరోసారి ప్రజలందరూ జాజాల సురేందర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ ఎగుల నర్సింహులు, భిక్కనూర్ ఉప సర్పంచ్ శ్రీకాంత్, సాయిబాబా, లక్ష్మయ్య, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పాలకవర్గ సమావేశాన్ని సంఘం అధ్యక్షులు ఎగుల నర్సింలు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సెప్టెంబర్ నెల జమ, ఖర్చులు కార్యదర్శి చదివి వినిపించారు. అలాగే మానిటరింగ్ ఆఫీసర్ రాధిక, ఎలక్షన్ కోడ్ దృష్ట్యా పాలకవర్గ సభ్యులకు ప్యాడి సెంటర్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. సమావేశంలో చైర్మన్ ఏగుల నర్సింలు, వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, డైరెక్టర్లు మర్రి సూర్యప్రకాష్, ఎంగల బాలరాజు, లంబాడి లక్ష్మణ్, చెన్నంగారి సుఖేందర్‌రెడ్డి, పార్దే నారాయణ, నర్ల నర్సింలు, కార్యదర్శి విశ్వనాథం, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన రాష్ట్రస్థాయి నాయకుడు

నవతెలంగాణ-లింగంపేట్
తెలంగాణ సోషల్ సర్వీస్ జాయింట్ సెక్రెటరీ లింగంపేట్ గ్రామానికి చెందిన మహమ్మద్ కాసిఫ్ సోమవారం ఎల్లారెడ్డిలోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

ప్రజలను ఆదుకోలేని వ్యక్తి.. మాజీమంత్రి

- ఎమ్మెల్యే షకీల్ ఆమేర్
- సాలూర బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం
- బైక్ ర్యాలీతో ఘన స్వాగతం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షకీల్ ఆమేర్

నవతెలంగాణ-బోధన్
కోట్ల రూపాయలు ఉన్న కరోనా కాలంలో ఆపదలో ఉన్న ప్రజలను ఏమాత్రం ఆదుకోలేని వ్యక్తి మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డి అని ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ అన్నారు. సోమవారం సాలూర మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల కార్యాలయాన్ని ప్రారంభించి అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. కరోనా కాలంలో జనం ఆ వైరస్‌తో ఆసుపత్రి పాలయితే కనీసం ఎవరిని పలకరించడం, పరామర్శించడం కానీ చేయలేని వ్యక్తి ఇప్పుడు ఓట్ల కోసం వచ్చి ప్రజలకు సేవ చేస్తానని, అభివృద్ధి చేస్తానని అంటే ఎవరు నమ్ముతారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న పథకాల వలన రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. గతంలో ఈ ప్రాంతంలో 5-10 లక్షలకు ఎకరం భూములకు ధర పలికిన నేడు కోటి రూపాయలకు ఎకరం ధర పలుకుతుందని ఇది కేసీఆర్ ఘనతేనని అన్నారు. సాలూర మండలం చేయాలని అడగగానే సీఎం కేసీఆర్ తక్షణమే స్పందించి మండల ఏర్పాటు చేశారన్నారు. రైతులకు అన్ని విధాలుగా సహకారం అందించి ఆదుకున్న వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు మోసపూరితమైన హామిలిచ్చి మోసం చేస్తే ఎవరు నమ్మరాదని సూచించారు. 60 సంవత్సరాల కాలంలో ప్రజల సంక్షేమం పట్టని కాంగ్రెస్ కర్నాటకలో ఇచ్చిన హామీలను కనీసం నెరవేర్చకుండా మోసం చేసిందన్నారు. దాంతో అక్కడి రైతులు తెలంగాణలో వచ్చి నిరసనలు చేస్తున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో భారీ మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు అయితే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కావున కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే..
సాలూర మండల బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సాలూర విచ్చేసిన ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు కార్యకర్తలు ఊరి పొలిమేర నుంచి భారీ బైక్‌ర్యాలీతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వయంగా బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పలు గ్రామాల నుంచి 100 మంది వరకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి ఎమ్మెల్యే పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు బుద్దె రాజేశ్వర్, డీసీసీబీ డైరెక్టర్లు శరత్, గంగారెడ్డి, వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, రవికిరణ్, సొసైటీ చైర్మెన్ అల్లె జనార్దన్, ఏఎంసీ వైస్ చైర్మెన్ సాలూర షకీల్, మండలాధ్యక్షులు నర్సయ్య, జాగృతి సాలూర మండల అధ్యక్షులు శివకాంత్ పటేల్, సురేష్, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు సాయరెడ్డి, షేక్ మౌలా, మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జికి ఇమ్రాన్ రాజీనామా



నవతెలంగాణ-తాడ్వాయి
మండలంలోని కృష్ణాజివాడి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జి ఇమ్రాన్ ఆ పదవికి ఆదివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో కొందరి పెత్తనమే నడుస్తుందని ఎవరిని పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. మైనార్టీలకు లక్ష రూపాయల ఆర్థికసాయం అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఒక్క మైనార్టీకి చెక్కు అందించలేదన్నారు. బీసీబంధులో పూర్తిగా అన్యాయం జరిగిందని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బీసీ బందులో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. తమ వర్గానికి చెందిన బీసీలకే బీసీబంధు అందించి చేతులు దులుపుకున్నారన్నారు. అందుకోసమే తాను పార్టీలో ఉండలేక తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

వరి, సోయా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ

నవతెలంగాణ-బోధన్
సాలూర మండలంలోని సాలూర, హున్స గ్రామ సొసైటీలలో సోమవారం ఇంచార్జీ ఏడీఏ సంతోష్ వరి, సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ వరికి రూ.2203, బీ గ్రేడ్ వరికి రూ.2183 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. అలాగే సోయా క్వింటాలుకు రూ.4600 మద్దతు ధర చెల్లిస్తున్నామని తెలిపారు. కావున రైతులు దళారులకు పంట విక్రయించి నష్టపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అపర్ణ, సీఈఓ బస్వంత్ రావు, రైతులు గంగారాం, దేవేందర్ పటేల్, సంజీవ్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే పార్టీ శ్రేణులతో ప్రమాణాలు

- డబ్బు బలంతోనే గెలవాలనుకుంటున్న మదన్ మోహన్
- బీఆర్‌ఎస్ నాయకుల ఆరోపణ


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
ఓటమి భయంతోనే పార్టీ శ్రేణులతో ప్రమాణాలు చేయించారని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే ఫామ్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజ్యాంగ విలు వలకు విరుద్ధంగా పార్టీ కార్యకర్తలతో ప్రమాణాలు చేయించడం సిగ్గుచేటని అన్నారు. డబ్బు బలంతోనే ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు అన్ని గమనిస్తున్నారని ఎమ్మెల్యే సురేందర్ చేసిన అభివృద్ధిని ప్రతి ఒక్కరూ గుర్తించారని వచ్చే ఎన్నికలు కూడా ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ని భారీ మెజార్టీతో ప్రజలు గెలిపిస్తారని కాంగ్రెస్ నాయకుల మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ఎగుల నర్సింహులు, బిఆర్‌ఎస్ నాయకులు బాలరాజ్‌గౌడ్, తిరుపతి, దామోదర్, రఘువీర్‌గౌడ్, పోచయ్య పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాద సభకు తరలిన మండల ప్రజలు


ప్రజా ఆశీర్వాద సభకు తరలిన ప్రజలు

నవతెలంగాణ-నిజాంసాగర్/వర్ని
మండల కేంద్రంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు ప్రజా ఆశీర్వాద సభకు బయలుదేరారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మనోహర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు అమలు చేసిన పథకాలు, ప్రభుత్వం వస్తే కొత్త పథకాల గురించి కేసీఆర్ వివరిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మల్లూరు సర్పంచ్ ఖాసింసాబ్, సొసైటీ చైర్మన్ కళ్యాణి, విఠల్‌రెడ్డి, అడ్డగళ్ళ భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్ని: బాన్సువాడ నియోజకవర్గంలో ప్రజల ఆశీర్వాద ఆత్మీయ సమ్మేళనం సభకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ విచ్చేయడంతో ఉమ్మడి మండలాలైన వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్ పరిధిలో గల గ్రామాల నుంచి ప్రజలు తరలివెళ్లారు. బస్సులలో, కారులలో, ఇతర వాహనాలలో ప్రజలను స్థానిక సర్పంచ్‌లు, మండల అధ్యక్షులు తరలించారు. కొన్ని గ్రామాలలో బయలుదేరే ముందు పూజలు, డప్పు వాయిద్యాలతో తరలివెళ్ళటంతో గ్రామాలలో పండగ వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రి సభలో మండల స్థాయి ఎంపీపీలు, జడ్పీటీసీ, సర్పంచ్ పాల్గొన్నారు.


వర్నిలో...

బీఆర్‌ఎస్‌కు మరోసారి ఓటేయండి



ఎల్లారెడ్డిలో ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న బిఆర్‌ఎస్ నాయకులు



మాచారెడ్డిలో ప్రచారంలో పాల్గొన్న బిఆర్‌ఎస్ నాయకులు

- పలుచోట్ల ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-విలేకరుల బృందం

బీఆర్‌ఎస్‌కు మరోసారి ఓటేయాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు సూచించారు. సోమవారం పలుచోట్ల ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

లింగంపేట్: మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండలస్థాయి నాయకులు, సర్పంచులు పార్టీ కార్యకర్తలు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండలంలోని బోనాల్, బోయిన్‌పల్లి, భయంపల్లి తండాలో, బోనాల తండాలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. అనంతరం గోడ స్టిక్కర్లను అతికించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టోను కరపత్రాలను ఓటర్లకు అందజేశారు. ఎల్లారెడ్డి శాసనసభ్యులు సురేందర్‌కు మరోసారి అవకాశం ఇచ్చి గెలిపించాలని ఓటర్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దివిటీ రమేష్, సర్పంచులు బాలయ్య, సాయగౌడ్, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: పట్టణ కేంద్రంలోని 12వ వార్డులో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మాట్లాడుతూ.. బిఆర్‌ఎస్ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. బిఆర్‌ఎస్ మేనిఫెస్టో అంశాలను ప్రతి ఒక్కరికి వివరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నీల కంఠం, బిఆర్‌ఎస్ నాయకులు నాగం సాయిబాబా, చక్రపాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: మండలంలోని సోమార్‌పేట్ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకూ తిరుగుతూ ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. సీఎం కేసీఆర్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుకు ఆహ్వానం

నవతెలంగాణ-సదాశివపగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ బోధించేందుకు గెస్ట్‌ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్.వి.రాధిక తెలిపారు. ఆసక్తి, అర్హతలు కలిగిన మహి ళా అభ్యర్థులు తేదీ 01/11/2023న కళాశాలకు అన్ని సర్టిఫికెట్స్‌తో వచ్చి, కళాశా లలో నిర్వహించే డెమో, ఇంటర్వ్యూకి హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

భోజన వసతి కల్పించిన సింగిల్ విండో చైర్మన్

నవతెలంగాణ-మద్నూర్



భోజనం చేస్తున్న కార్యకర్తలు

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జుక్కల్ అసెంబ్లీలో ఎన్నికల ప్రచార నిమిత్తం సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ జుక్కల్ చౌరస్తాలో నిర్వహించిన జుక్కల్ నియోజకవర్గం ఎన్నికల ప్రచారానికి మద్నూర్ మండలంలోని పెద్దఎక్లారా గ్రామం నుంచి ముఖ్యమంత్రి సభకు తరలి వెళ్లిన జనాలకు ఆ గ్రామపెద్దలు మద్నూర్ సింగిల్విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ భోజన వసతులు కల్పించారు. గ్రామం నుంచి వెళ్లి మధ్యలో ఒకచోట ముఖ్యమంత్రి సభకు తరలివెళ్లిన వందల మందికి భోజనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుటుంబ సభ్యులు శంకర్ పటేల్, యువ నాయకులు ప్రదీప్ పటేల్, హనుమాన్ టెంపుల్ చైర్మన్, మాజీ సొసైటీ చైర్మన్ పండిత్ రావు, బిఆర్‌ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు సుధాకర్ పటేల్, బిఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాద సభకు తరలిన ప్రజలు



సభకు తరలిన ప్రజలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు జుక్కల్ నియోజకవర్గంలోని జుక్కల్ చౌరస్తాలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చిన సందర్భంగా ఎంపీపీ ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో వద్దకి వచ్చిన జనాలు అక్కడి నుంచి కేసీఆర్ సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు, కార్యకర్తలు, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన పోసానిపేట్ ఆలయ కమిటీ చైర్మన్

నవతెలంగాణ-రామారెడ్డి

పోసానిపేట్ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ బండి పోచయ్య సోమవారం ఎల్లారెడ్డి నియోజకవర్గ బిఆర్‌ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై, పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్ రెడ్డి, సర్పంచులు సంజీవ్, గంగారాం, చందర్ నాయక్, నాయకులు కిషన్ గౌడ్, పోతుల చిన్న బాపురెడ్డి, సాకలి బుచ్చి బాలయ్య, తదితరులున్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

సామాజిక తెలంగాణ బీఎల్‌ఎఫ్‌తోనే సాధ్యం

- బీఎల్‌ఎఫ్ బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ మోసిన్

నవతెలంగాణ-బోధన్‌టౌన్



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ మోసిన్

సామాజిక తెలంగాణ బీఎల్‌ఎఫ్‌తోనే సాధ్యమని బీఎల్‌ఎఫ్ బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ మోసిన్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలో ఎంసీపీఐయూ, బీఎల్‌ఎఫ్ ముఖ్య నాయకులతో ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బిఎల్‌ఎఫ్ బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండి మోసిన్ మాట్లాడుతూ.. బహుజనులకు అధికారం వస్తేనే బహుజనుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన అన్నారు. ఎసీ, ఎస్టీ, బిసి, మైనార్టీల ఐక్యత వల్లనే పీడిత ప్రజల సమస్యలు ఒక బహుజనులకై రాజ్యాధికారంతోనే సాధ్యమవుతాయన్నారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్, బిజెపి, పాలక పార్టీలు వివిధ ప్రజల సమస్యలను పరిష్కరించని తెలిపారు. కమ్యూనిస్టులు, బహుజనులు ఐక్యంగా ఉండి అధికారంలోకి రావడమే బీఎల్‌ఎఫ్ లక్ష్యమన్నారు. ఎంసిపిఐయూ జిల్లా నాయకురాలు తోట సంగీత, నాయకులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఛలో హైదరాబాద్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ రాష్ట్ర న్యాయవాదులు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం బోధన్ న్యాయవాదులు కోర్టు వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది వీఆర్ దేశాయ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ జలవిహార్‌లో న్యాయవాదులు నవంబర్ 4వ తేదీన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్, బోయిన్పల్లి వినోద్‌కుమార్, కాలేరు వెంకటేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జి.శ్యామ్‌రావు, ఆబిద్ అహ్మద్, లీగల్ సెల్ ఇంచార్జ్ తర్ల శంకర్, సూర్యప్రకాష్, మాధవీలత, జి.శంకర్, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-గాంధారి



ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆదివారం అర్ధరాత్రి సమయంలో మండల కేంద్రానికి చెందిన కోరండ్ల రాజేశ్వర్ (54) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రేమ్‌దాస్ తెలిపారు. భార్య కురండ్ల విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌కు కురుమల మద్దతు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు షకీల్ అమీర్‌ను మర్యాదపూర్వకంగా బోధన్ కురుమ సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కురుమ కులస్తులందరూ కూడా పార్టీకి మద్దతు తెలియజేస్తున్నామంటూ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ అధ్యక్షులు వీరయ్య, సర్పంచ్ రావుబా గంగాధర్, కురుమ సంఘం బోధన్ మండలాధ్యక్షులు మేడి రవి, సాయిలు, శెట్టికొండ సుధాకర్, చందు, శంకర్, సాయిలు, మల్లయ్య, పోశెట్టి, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



షకీల్‌ను కలిసిన కురుమ సంఘం నాయకులు

సోయాబీన్, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-మద్నూర్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మద్నూర్ ఆధ్వర్యంలో మద్నూర్ మార్కెట్ యార్డ్ యందు సోమవారం సోయాబీన్, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమం లో ఏఈఓ ప్రియాంక, ఏఎంసి సెక్రటరీ విఠల్, సూపర్వైజర్ సత్యం, ఎన్డీసీసీ బ్యాంక్ మేనేజర్ సాయిలు, సింగిల్‌విండో సెక్రటరీ జే బాబురావు రైతులు పాల్గొన్నారు.

కందకుర్తి చెక్‌పోస్ట్ తనిఖీ

నవతెలంగాణ-రెంజల్



తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ

మండలంలోని కందకుర్తి చెక్‌పోస్టును బోధన్ రూరల్ సీఐ శ్రీనివాసరాజ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అంతరాష్ట్ర సరిహద్దుల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బ్రిడ్జి ఆవలి భాగంలో మహారాష్ట్ర ప్రభుత్వం సైతం ఏర్పాటు చేశారని, చెక్‌పోస్టును తనిఖీ చేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మహారాష్ట్ర నుంచి తెలంగాణకు మద్యం సరఫరా కాకుండా ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉదయ్ కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

నవతెలంగాణ-మాచారెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

షబ్బీర్ అలీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గణేష్ నాయక్ తెలిపారు. సోమవారం మండలంలోని గజ్జియా నాయక్ తండాలో విలేకరులతో మాట్లాడుతూ కామారెడ్డి నియోజకవర్గంలో షబ్బీర్ అలీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని సీఎం కెసిఆర్‌ను కామారెడ్డిలో చిత్తుచిత్తుగా ఓడిస్తామని అన్నారు. కార్యక్రమంలో రవిగౌడ్, తిరుపతి, బన్సీలాల్, సతీష్, కాంగ్రెస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారువాడగా బాన్సువాడ

- పోచారం గెలిస్తే ఉన్నత హోదా : సీఎం కేసీఆర్
- ఒక్క ఓటుకు ముగ్గురం కూలీ చేస్తున్నం : స్పీకర్ పోచారం



మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

రాష్ట్రంలో మరే ఇతర నియోజకవర్గంలో లేని విధంగా 11 వేల డబుల్ బెడ్ రూమ్ లు నిర్మాణం, సుమారు రూ.14 వేల కోట్లతో బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన లక్ష్మీ పుత్రుడు పోచారం శ్రీనివాసరెడ్డిని లక్ష మెజారిటీతో గెలిపించాలని సీఎం కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి గెలిచిన అనంతరం రాష్ట్రంలో ఉన్నత హోదా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గ కన్నా బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి చెందిందన్నారు. బాన్సువాడలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్.. స్పీకర్‌పై ప్రశంసలజల్లు కురిపించారు. రాష్ట్రంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి అజాతశత్రువుగా పేరుందన్నారు. అనునిత్యం యువకుడి లాగా నియోజకవర్గం అభివృద్ధి కోసం రాత్రి పగలు అనే తేడా లేకుండా పనిచేస్తున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎల్లప్పుడు ప్రజల అభివృద్ధి కోసమే ఆలోచిస్తారని అని అన్నారు. నిజాంసాగర్‌లను నిండుకుండలుగా మార్చారని, రైతులకు రెండు పంటలకు సరిపడా నీటినందించి బీడు భూములను సస్యశ్యామలం చేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో మొదటి వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న పోచారం హయాంలోనే రైతు బంధు పథకాన్ని తెచ్చారని వారి మనుమళ్లు, మునిమనవళ్లు దర్జాగా చెప్పుకోవచ్చని తెలిపారు.



సభలో ఉత్సాహంగా పాల్గొన్న యువకులు

ఒక ఓటుకు ముగ్గురం కులీ పనిచేస్తున్నాం: స్పీకర్

రాష్ట్రంలోని బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధి సంక్షేమలో ఆదర్శంగా నిలిచిందని అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క ఓటు వేస్తే ముగ్గురం బాన్సువాడ అభివృద్ధి కోసం ముగ్గురం కూలి పని చేస్తున్నామని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తన చిన్న కుమారుడు సొంత డబ్బులు ఖర్చు పెట్టి ఇప్పటివరకు వందమందికి ఉచిత శిక్షణ ఇప్పించి 200 మందికి కానిస్టేబుళ్లు మరో 1400 మందికి జాబు వచ్చేలా కృషి చేసినట్టు తెలిపారు. అలాగే తన రెండవ కుమారుడు సురేందర్ రెడ్డి గ్రామాల్లో సమస్యలను తెలుసుకొని వారిని పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. బాన్సువాడలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నారంటూ ప్రతిపక్ష నాయకులు మాట్లాడడం సిగ్గుచేటుగా ఉందన్నారు. తనను ఏడుసార్లు గెలిపించిన బాన్సువాడ నియోజకవర్గం ప్రజలకు కృతజ్ఞ తలు తెలిపారు. అభివృద్ధి సంక్షేమం చేసిన ఓటు హక్కు అడిగే అర్హత తమకే ఉందని లేనిపోని మాటలు నమ్మి ఎవరు మోసపో కూడదని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, డిసిసిబి చైర్మన్ భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, బిఆర్ఎస్ పార్టీ నేత పోచారం సురేందర్ రెడ్డి, అంజిరెడ్డి వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

ఎమ్మెల్యే షిండే.. సౌమ్యుడు

మరోసారి ఆశీర్వదించాలి : సీఎం కేసీఆర్

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే మంచి వ్యక్తిత్వం కలిగిన వారని, సౌమ్యుడు ప్రజల మనిషి అని సీఎం కేసీఆర్ ప్రశంసించారు. ఎంపీ బిబి పాటిల్ గుణవంతుడని హైవే రోడ్డు మంజూరు చేయించి వేయించారని, ఇద్దరు దొరకడం జుక్కల్ నియోజకవర్గ ప్రజల అదృష్ట మని అన్నారు. ఎమ్మెల్యే షిండేకు మద్దతుగా సోమవారం జుక్కల్‌లో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రసంగించారు. ఆలోచించి ఓటును వినియోగించుకోవాలని, ఉల్టాపల్టా గాళ్లున్నారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎండిన నిజాంసాగర్‌ను చూసిన తరువాత తెలంగాణ ఉద్యమం నీరు నిధులు , ఉద్యోగాలు పైన పోరాటం చేసి తెలంగాణ కోసం పోరాటం చేస్తే తప్పా తెలంగాణ ప్రజలకు మేలు జరగదని ఉద్యమం మొదలు పెట్టామని తెలిపారు. అమరణ నిరాహార దీక్ష చేస్తే కాంగ్రెస్‌వాళ్లు తెలంగాణను ఇచ్చినట్టే ఇచ్చి వాపసు తీసుకున్నారని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ పార్టీ వారు దోకాబాజీగాళ్లని విమర్శించారు.

అంతకుముందు ఎమ్మెల్యే షిండే మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గంలో వంద గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదని 60 ఏండ్ల పాలనలో అభివృద్ధి మరిచారని, తాను వచ్చిన తరువాత 80 గ్రామాలకు రోడ్డు వేయించినట్టు తెలిపారు. డిగ్రీ కాలేజీలు, ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాల భవనాల నిర్మాణం చేపట్టామని వేల కోట్లతో పదేండ్లలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. తనకు మరో సారి గెలిపించి సేవా చేసే భాగ్యాన్ని కల్పించాలని కోరారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపి బీబీ పాటీల్, జడ్పి చైర్మన్ దఫేదార్ శోభరాజు నియో జకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హన్మంత్‌షిండే

అల్పాహారం అందేనా..?

- మండలంలో అమలుకాని పథకం

నవతెలంగాణ-సదాశివనగర్

దసరా నుంచి ప్రతి పాఠశాలలో విద్యార్థుల కోసం అల్పాహారం ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. మండలంలో మాత్రం ఎక్కడా అమలు కావడం లేదు. వారం రోజులు దాటినా ఒకే ఒక పాఠశాలలో ప్రారంభించినట్లు విద్యాధికారులు చెబుతున్నారు.

మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీలున్నాయి. వాటి పరిధిలో సుమారు 11 ఉన్నత పాఠశాలలు, 23 ప్రాథమిక పాఠశాలలున్నాయి. అయితే ఎన్నికల షెడ్యూల్‌కు ముందే సీఎం కేసీఆర్ అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తామని చెప్పినా.. మండలంలో మాత్రం అమలుకావడం లేదు. ఇదిలా ఉండగా.. 'మాకే సరిగా డబ్బులు ఇవ్వని ప్రభుత్వం అల్పాహారం పథకాన్ని సక్రమంగా నడుపుతుందా?' అంటూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు.

కందకుర్తి చెక్‌పోస్టు వద్ద రూ.2లక్షలు పట్టివేత



నవతెలంగాణ-రెంజల్

రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అంతరాష్ట్ర కందకుర్తి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కందకుర్తి గ్రామానికి చెందిన తాహెర్ బేగ్ వద్ద రెండు లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని బోధన్ రూరల్ సీఐ శ్రీనివాసరాజ్, ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. తాహెర్‌బేగ్ ఎలాంటి అనుమతిపత్రాలు లేకుండా రెండు లక్షల రూపాయలను తీసుకువెళ్తుండగా పట్టుకున్నామని వారు పేర్కొన్నారు. తదుపరి చర్యల కోసం సర్వే లెన్స్ టీమ్‌కు అప్పగిస్తామని, అనంతరం తగుచర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. వారి వెంట చెక్‌పోస్ట్ సిబ్బంది ఉన్నారు.

25 లక్షల విలువ గల గంజాయి పట్టివేత

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలోని గాంధారి మండలంలోని ఓసుల కుంట తాండలో సోమవారం పత్తి చెనులో 232 గంజాయి మొక్కలను పట్టుకున్నట్లు ఎక్సైజ్ జిల్లా అధికారి రవీంద్ర రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓసుల కుంటా తండాలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది దాడులు నిర్వహించి రూ.25 లక్షల విలువ గల మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడులలో 4 నుంచి 5 ఫీట్ల వరకు ఎత్తున్న 232 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయితే స్థానిక రైతులను విచారించగా దారవత్ జైతిరామ్ అనే రైతు మొక్కలను సాగుచేసినట్టు తెలిపారు. ప్రస్తుతం ఆ వ్యక్తి పరారీలో ఉన్నాడని అతనిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.



గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు..

గంజాయి సాగుకు పాల్పడితే ఐదు సంవత్సరాల జైలు శిక్ష పడుతుందని ఆయన తెలిపారు. గంజాయి ఎక్కడైనా సాగు చేస్తే తమకు వివరాలు తెలియజేయాలని గంజాయి సమాచారం తెలిపిన వ్యక్తి వివరాలను గోప్యంగా ఉంచుతామని వివరించారు. ప్రజలు, యువత గంజాయి అరికట్టేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గంజాయి వల్ల యువత పెడదారి పట్టే ప్రమాదం ఉందని, కాబట్టి గంజాయి సాగు చేసే వారి వివరాలను తమకు తెలియజేయాలని కోరారు. ఇప్పటి వరకూ ఎక్సైజ్ శాఖ దాడుల్లో రూ.కోటి 7లక్షల విలువ గల 45,840 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఎన్నికలలో భాగంగా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని తెలిపారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు ఎ.సుందర్ సింగ్, షాకిర్ అహ్మద్, ఎస్ఐలు బి.మమత, ఎండి.జలలొద్దిన్, సిబ్బంది బాల్‌రెడ్డి, అభిషేక్, నవీన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సరితా, రవి, సందీప్‌గౌడ్, భూపల్, లావణ్య, స్రవంతి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో సీఈవో రాము అధ్యక్షతన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. రైతులు తమ పంటను దళారులకు విక్రయించి మోసపోకూడదని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఏ గ్రేడ్ 2203, బి.గ్రేడ్ 2183 ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రసాద్, క్లార్క్ ఇంతియాజ్, సిబ్బంది కిషోర్, శ్రీనివాస్, రైతులు వేణు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-రామారెడ్డి

స్నేహమంటే సుఖ సంతోషాలతో పాటు కష్టాల్లో కూడా మేమున్నామని భరోసా కల్పించడమే స్నేహానికి నిర్వచన మని నిరూపించింది రామారెడ్డి యువసేన యూత్ అసోసియేషన్ బృందం. మండల కేంద్రానికి చెందిన తూర్పు నరసింహులు కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని తెలుసుకొని, కలిసి చదువుకున్న మిత్రులందరు కలిసి, వారి కుటుంబానికి రూ.27,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సింలు కుటుంబం, ఆర్థిక సహాయం అందజేసిన మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.